## ఆప్‌ని చీల్చడం రాజకీయ వ్యవస్థకు మాయని మచ్చ

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ



ప్రజాపక్షం/హైదరాబాద్ : పంజాబ్ ఎన్నికల్లో బిజెపి గెలుపొందేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)ని చీల్చడం పార్లమెంటరీ రాజకీయ వ్యవస్థకు మాయని మచ్చ అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ అన్నారు. ప్రగతిశీల, ప్రజాస్వామ్య శక్తులు బిజెపి కుట్రలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేయడమే మన ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజ్యసభలో ఉన్న మెజారిటీ ఆప్ సభ్యుల సంతకాలతో బిజెపిలో విలీనం చేస్తున్నామనే ప్రకటించటం ప్రజాస్వామ్య వ్యవస్థలో చీకటి రోజు అన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన అన్ని సంస్థలను, చివరికి ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియాతో సహా అన్ని వ్యవస్థలను, సంస్థలను తమ గుప్పి ట్లో పెట్టుకుని తమ మాటను వినని, తమ విధానాలను వ్యతిరేకిస్తున్న రాజకీయ పార్టీలను భయాందోళనకు గురి చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీల నాయకులపై ఈడీ, సిబిఐ, ఐటి దాడులు తీవ్రతరం చేస్తూ భయపెట్టి లొంగదీసుకుని పార్టీలను కనుమరుగు చేస్తున్న పరిస్థితుల్లో బిజెపి చేస్తున్న అత్యంత దివాళాకోరు, రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలను ప్రజల ముందుకు తీసుకెళ్లి ప్రజాక్షేత్రంలో బిజెపిని రాజకీయంగా సమాధి చేయడానికి అందరం సిద్ధం కావాలని నరసింహ తెలిపారు.



ఇటీవలే డిజిపి హోదా పొందిన అధికారులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. సిఎంను కలిసిన వారిలో పదోన్నతి పొందిన వివి శ్రీనివాస రావు, స్వాతి లక్రా, మహేష్ భగవత్, చారు సిన్హా, డాక్టర్ అనిల్ కుమార్, విసి సజ్జనార్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి ఉన్నారు.

## తెలుగు సాహితీవనం కథా పురస్కారం 2026 ఫలితాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలుగు సాహితీవనం కథా పురస్కారం కోసం నిర్వహించిన కథల పోటీకి వివిధ ప్రాంతాల నుండి దాదాపు 200 కథలు వచ్చాయని తెలుగు సాహితీవనం వ్యవస్థాపకులు శాంతికృష్ణ తెలిపారు. వడపోతల అనంతరం ఇద్దరు న్యాయనిర్ణేతలు రూప్ కుమార్ డబ్బీకార్, సత్యాజీకి రచయితల పేర్లు తీసివేసి కథలు పంపించాము. వారు పరిశీలించి వేసిన మార్కుల ఆధారంగా ఎన్.సురేంద్రనాథ్ (ప్రొద్దుటూరు), హిమబిందు రామకృష్ణ (వైజాగ్), కృపాకర్ పోతుల (హైదరాబాద్), సొతుకు రత్న జానకి (మంచిర్యాల) కథలు పురస్కారానికి ఎంపికయ్యాయి. విజేతలకు అభినందనలు. ఈ పోటీకి తమ కథలు పంపి, జయప్రదం చేసిన రచయిత(త్రు)లకు ధన్యవాదాలు. తెలుగు సాహితీవనం జూలైలో నిర్వహించే 9వ వార్షికోత్సవ సభలో విజేతలకు పురస్కార ప్రదానం ఉంటుందని తెలుగు సాహితీవనం వ్యవస్థాపకులు శాంతి కృష్ణ తెలియజేశారు.

## దేశవ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థల భారీ విస్తరణ

ఆరు రాష్ట్రాల్లో 38 కొత్త క్యాంపస్‌లు

ప్రజాపక్షం/హైదరాబాద్ : దేశవ్యాప్తంగా విద్యా ప్రమాణాలను పెంచడమే తమ లక్ష్యమని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనూ సమానంగా నాణ్యమైన విద్య అందించేందుకు కట్టుబడి ఉన్నామని నారాయణ విద్యాసంస్థల ప్రతినిధులు తెలిపారు. నారాయణ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యాసంస్థలు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నాయన్నారు. 6 రాష్ట్రాల్లో 38 కొత్త క్యాంపస్‌లలో దేశవ్యాప్తంగా నారాయణ విద్యాసంస్థలు భారీ విస్తరణ చేపట్టినట్లు వారు ప్రకటించారు. 2026–27 విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల్లో మొత్తం 38 కొత్త క్యాంపస్‌లు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు, నాణ్యమైన బోధన అందించడమే లక్ష్యంగా ఈ విస్తరణ చేపట్టినట్లు తెలిపారు. ఈ కొత్త క్యాంపస్‌లలో ఆధునిక ల్యాబ్స్, డిజిటల్ క్లాస్ రూమ్స్, హాస్టల్ సదుపాయాలు, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం అందుబాటులో ఉంటాయని సంస్థ పేర్కొంది. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు, ఒలింపియాడ్ పోటీ పరీక్షల కోచింగ్ కూడా అందించనున్నారు. ఈ విస్తరణతో విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని, దేశ విద్యా రంగంలో నారాయణ సంస్థలు మరింత కీలక పాత్ర పోషించనున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కొత్తగా ఏర్పాటు చేసే క్యాపస్ ప్రాంతాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా కొత్త క్యాంపస్‌లు ఏర్పాటు, తెలంగాణలో గణనీయమైన విస్తరణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలో కొత్త కేంద్రాలు, ఢిల్లీలో కూడా ప్రత్యేక క్యాంపస్ ఏర్పాటు చేస్తున్నారు.

## ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించిన జిహెచ్‌ఎంసి



ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు, పాదచారులకు సురక్షిత మార్గాలను అందించడం లక్ష్యంగా జిహెచ్‌ఎంసి ఆక్రమణల తొలగింపు డ్రైవ్‌ను కొనసాగిస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం జిహెచ్‌ఎంసి పరిధిలోని ఆరు జోన్‌లలో విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టింది. ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీసులతో సమన్వయంతో ఫుట్‌పాత్‌లు, రోడ్ మార్జిన్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. ప్రతి జోన్‌లో ఒక ముఖ్య రహదారి భాగాన్ని ఎంపిక చేసి, సంబంధిత సర్కిల్ సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని పద్ధతిగా నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో విజిలెన్స్ విభాగం పోలీసులతో కలిసి సమన్వయం చేయగా, ఇంజనీరింగ్ విభాగం ద్వారా యంత్రాలు, సిబ్బందితో సహకారం అందించారు. పారిశుద్ధ్య విభాగం చెత్త తొలగింపు పనులను చేపట్టింది. జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, చీఫ్ సిటీ ప్లానర్ కె. శ్రీనివాస్, జోనల్ కమిషనర్లు కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, డిప్యూటీ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఇప్పటి వరకు మొత్తం 2337 ఆక్రమణలు తొలగించినట్లు అధికారులు తెలిపారు. నగరంలో ఆక్రమణలు లేని రోడ్లను కల్పించేందుకు జిహెచ్‌ఎంసి కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. ఫుట్‌పాత్‌లు, రోడ్లపై ఆక్రమణలు చేయకుండా పౌరులు, వ్యాపారులు సహకరించాలని, లేకపోతే వాటిని కఠినంగా తొలగిస్తామని హెచ్చరించారు.

# మహిళా పోలీసు అధికారులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో పెద్దపీట

హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, మల్కాజ్‌గిరి కమిషనర్ హోదాలలో తొలిసారిగా మహిళా అధికారులు






ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణలో తాజాగా జరిగిన అధికారుల బదిలీలలో మహిళా ఐపిఎస్ అధికారులకు గణనీయ ప్రాధాన్యం కల్పించారు. కీలక విభాగాలు, ముఖ్య స్థానాల్లో మహిళా అధికారులను నియమించడం ద్వారా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మహిళలపై గౌరవం చాటుకుంది. ఇటీవల జరిగిన ఏడుగురు ఐపిఎస్ అధికారుల్లో రికార్డు స్థాయిలో తొలిసారిగా రెండు స్థానాల్లో మహిళా అధికారులు దక్కించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శిఖాగోయల్‌ను, మల్కాజ్‌గిరి పోలీసు కమిషనరేట్ కమిషనర్‌గా బి.సుమతిని నియమించారు. హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హోదా, పోలీసు కమిషనర్ హోదాలో మహిళలను నియమించడం ఇదే తొలిసారి. మొదటిగా, మహిళా సాధికారతను కేవలం సంక్షేమ కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, పరిపాలనా వ్యవస్థలోనూ ప్రతిఫలింపజేయాలనే ప్రభుత్వ సంకల్పం ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటివరకు పురుషాధిక్యంగా ఉన్న ఉన్నతస్థాయి పోస్టుల్లో మహిళలకు అవకాశాలు ఇవ్వడం ద్వారా సమాన అవకాశాల విధానాన్ని బలపరిచినట్లయ్యింది. ఇంకా, మహిళా అధికారుల పనితీరు పట్ల ఉన్న సానుకూల అభిప్రాయాలు కూడా ఈ నిర్ణయానికి కారణమయ్యాయి. చట్ట అమలు, సంక్షేమ పథకాల అమలు, ప్రజలతో మమేకం కావడం వంటి అంశాల్లో మహిళా అధికారులు సమర్థతను చూపిన అనేక ఉదాహరణలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ, పట్టణ స్థాయిల్లో ప్రజలతో నేరుగా సంబంధం కలిగిన విభాగాల్లో మహిళల పాత్ర కీలకంగా మారుతోంది. నిర్మల్ జిల్లా ఎస్‌పి జానకీ షర్మిల కొత్తగా ప్రవేశపెట్టిన 'పోలీసు అక్క' కార్యక్రమం దేశంలోనే రికార్డు సాధించింది. ఈ కార్యక్రమానికి గుర్తించి ఇటీవలే కేంద్ర హోంశాఖ ఢిల్లీలో ఎస్‌పి జానకీ షర్మిలకు అవార్డును సైతం అందించారు. ప్రజలలో విశ్వాసం పెంచడం కూడా ఒక ప్రధాన కారణంగా భావిస్తున్నారు. మహిళా అధికారులపై ప్రజల్లో ఉన్న నమ్మకం, అందుబాటు భావన, పారదర్శకత వంటి అంశాలు ప్రభుత్వానికి అనుకూలంగా మారుతున్నాయి. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, బలహీనవర్గాలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో మహిళా అధికారుల నియామకం మరింత ఫలితాలను ఇస్తుందనే అభిప్రాయం ఉంది. మొత్తంగా తెలంగాణ పోలీసు శాఖలో తాజా బదిలీల్లో మహిళా అధికారులకు పెద్ద పీట వేయడం పరిపాలనలో సమతుల్యాన్ని తీసుకురావడమే కాకుండా, మహిళా సాధికారతకు కొత్త దిశగా మారుతోంది. ఇప్పటికే జైళ్ల శాఖ, ఎసిబి, సిఐడి కీలక విభాగాలకు మహిళా అధికారులు సౌమ్యా మిశ్రా, చారుసిన్హాలు కొనసాగుతున్నారు. అంతేకాకుండా ఆయా జిల్లాలకు ఎస్‌పిలుగా, జోన్ డిసిపిలుగా కూడా మహిళలు కొనసాగుతున్నారు.

## ఐఎఎస్ అధికారుల బదిలీలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ సాధారణ పరిపాలన (స్పెషల్ ఎ) శాఖ ఐఎఎస్ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై కీలక ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలన అవసరాల దృష్ట్యా పలువురు ఉన్నతాధికారులను మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్‌ను తెలంగాణ భవన్, న్యూఢిల్లీకి ప్రత్యేక అధికారిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎల్‌ఈటీఎఫ్ శాఖలో పనిచేస్తున్న దాన కిశోర్‌ను పీఆర్‌ఆర్డీ, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ఎస్ఏడీ శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా నియమించారు. బి.విజయేంద్రను ఎస్సీడీ శాఖ కార్యదర్శిగా బదిలీ చేయడంతో పాటు టీజీఎస్డబ్ల్యూఆర్ఈఐఎస్ కమిషనర్ బాధ్యతలను కూడా అదనంగా అప్పగించారు. హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరిని ఎల్‌ఈటీ&ఎఫ్ శాఖ కార్యదర్శిగా నియమించగా, రెవెన్యూ (డీఎం) శాఖలో కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖ డైరెక్టర్ కృష్ణ ఆదిత్యను పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శిగా మార్చారు. సివిల్ సప్లైస్ డైరెక్టర్ జెండగే హనుమంత్ కొండిబాను ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ సీఈఓగా నియమించి, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలో అదనపు బాధ్యతలు ఇచ్చారు. సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్యను ఆర్&బీ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ చేశారు.గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్ బీఎంను అదే శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించి, డైరెక్టర్ హోదాలో అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ బదిలీలతో పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం

ప్రజాపక్షం/హైదరాబాద్: సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరోసారి సాక్షుల విచారణను సిట్ అధికారులు మొదలు పెట్టారు. ఈ మేరకు యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్, టిటిడి మాజీ సభ్యులు కె. శివకుమార్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది. మే 28వ తేదీన హాజరు కావాలని నోటీసుల్లో సిట్ అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విచారణకు హాజరు కావాలని నోటీసులో పేర్కొన్నట్లు తెలిసింది.

## కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతోనే క్రీడాభివృద్ధి

శ్రీనగర్ చింతన్ శిబిర్‌లో మంత్రి వాకిటి శ్రీహరి




ప్రజాపక్షం/హైదరాబాద్: క్రీడల అభివృద్ధి కేవలం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రమే కాకుండా ప్రజల భాగస్వామ్యం తో పాటు క్రీడా సంఘాలు వివిధ స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు సమిష్టిగా కృషి చేసినప్పుడే సమగ్ర క్రీడాభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ రాష్ట్ర యువజన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం నుండి మూడు రోజులపాటు జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం శ్రీనగర్‌లో జరుగుతున్న చింతన్ శిబిర్ 2026కు తెలంగాణ నుండి క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (క్రీడలు) జయేశ్ రంజన్, క్రీడా సలహాదారులు ఎపి జితేందర్ రెడ్డి, చైర్మన్ శివసేనారెడ్డి, ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, ప్రముఖ క్రీడాకారులు పుల్లెల గోపీచంద్ గగన్ నారంగ్ తదితరులు హాజరయ్యారు. శ్రీనగర్‌లోని షేర్ ఏ కాశ్మీరి ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్ ప్రాంగణంలో ఉదయం యోగా తో ప్రారంభమైన ఈ కార్యక్రమాల్లో ఖేలో ఇండియా మిషన్ మెడల్ స్ట్రాటజీ, ఖేలోభారత్ నీతి కేంద్ర రాష్ట్రాల సమన్వయం, స్వచ్ఛత, సురక్ష క్రీడలు, ప్రతిభ గుర్తింపు,అభివృద్ధి అంశాలపై చర్చ జరిగింది. తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ దేశంలో మంచి, బలమైన క్రీడా వాతావరణం నిర్మాణం జరగాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా కృషి చేయాలని దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చే విధంగా భవిష్యత్తు కార్యాచరణ ఉండాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాలుగా ఒకవైపు కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను రాష్ట్రంలో దిగ్విజయంగా అమలు చేస్తూనే, దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చే అనేక కార్యక్రమాలను రూపొందించి బ్రహ్మాండంగా నిర్వహిస్తుందని మంత్రి వివరించారు.

## మైనారిటీలకు కాంగ్రెస్ పార్టీ అండ

టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్ కుమార్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళల మైనారిటీలకు అండగా నిలుస్తూ, సిక్కులు, క్రిస్టియన్, ముస్లిం వర్గాలకు న్యాయం చేసే విధానాలు అమలు చేసిందని టిపిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం ప్రకాశం హాల్‌లో టిపిపిసి మైనారిటీ విభాగం చైర్మన్‌గా మహమ్మద్ ఇర్ఫాన్ అలీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహేశ్ కుమార్ గౌడ్, ఎఐసిసి సెక్రటరీ సచిన్ సావంత్, మంత్రి అజారుద్దీన్, మాజీ ఎంపి వి.హనుమంతరావు, ఫ్రంటల్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్‌లు, కార్పొరేషన్ చైర్‌పర్సన్‌లు, పలువురు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో మైనారిటీ వర్గాల నుంచి ఎంఎల్‌ఎలుగా గెలవకపోవడం శోచనీయమని అన్నారు. 2028 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మైనారిటీ వర్గాలకు మెజార్టీగా టికెట్లు ఇవ్వాలని పార్టీ నిర్ణయించిందని తెలిపారు. రూరల్ ప్రాంతాల నుంచి మైనారిటీ చైర్మన్‌ను తీసుకురావాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని, మైనారిటీ విభాగాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.రాష్ట్రంలో ఇప్పటికే 8 మంది మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్లను నియమించామని తెలిపారు. జిల్లాల్లో పర్యటిస్తూ మైనారిటీ విభాగాన్ని బలోపేతం చేయాలని ఇర్ఫాన్ అలీకి మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. కె.చంద్రశేఖరరావు పాలనలో ఆర్‌టిసి కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొగా, కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలను సామరస్యపూర్వక చర్చల ద్వారా పరిష్కరించడం ప్రజాస్వామ్య పాలనకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వంలో అంబానీ, అదానీ లాంటి వ్యాపారవేత్తల ఆస్తులు అమాంతం పెరిగిపోయాయని, కానీ పేదవాడు పేదగానే మిగిలిపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు.

## 2030 నాటికి మలేరియా రహిత హైదరాబాదే జిహెచ్‌ఎంసి లక్ష్యం

సిఎంఓహెచ్ డాక్టర్ కె.పద్మజ




ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) నగరవ్యాప్తంగా మలేరియా, ఇతర వాహకజన్య వ్యాధులపై అవగాహన పెంపొందించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిహెచ్‌ఎంసి అన్ని సర్కిళ్లలోని ఎంటమలాజీ సిబ్బందిని సమీకరించి ప్రజలతో ప్రత్యక్ష అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. జోనల్ కమిషనర్లు, ఏఎంఓహెచ్‌లు, ఆరోగ్య శాఖ (యుపిహెచ్‌సిలు) సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో వార్డు స్థాయిలో ర్యాలీలు, డండోరాలు ద్వారా నివారణ సందేశాలను ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి సమాచార, విద్య, కమ్యూనికేషన్ (ఐఈసి) కార్యక్రమాల ద్వారా గృహ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. దోమల లార్వా, వాటి పెరుగుదల ప్రాంతాలపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించి మూలస్థాయిలో నియంత్రణ చర్యలపై ప్రజలకు వివరించారు. జిహెచ్‌ఎంసి ముఖ్య వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కె. పద్మజ మెట్రోపాలిటన్ సర్వైలెన్స్ యూనిట్ బృందం చారిత్రాత్మక సర్ రోనాల్డ్ రాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యారాసిటాలజీలో నిర్వహించిన క్రియేటింగ్ లెగసీ, వరల్డ్ మలేరియా డే 2026 సాంకేతిక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిపుణులు మలేరియా నివారించదగినదని, చికిత్స చేయదగినదని, అయితే పట్టణాల్లో వేగంగా జరుగుతున్న నిర్మాణాలు, నీటి నిల్వల వంటి సమస్యల దృష్ట్యా సమగ్ర వాహక నిర్వహణ (ఐవిఎం) అవసరమని తెలిపారు. మలేరియాతో పోరాటం కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదు, ఇది ప్రజల ఉద్యమం, అని జిహెచ్‌ఎంసి సిఎంఓహెచ్ పద్మజ తెలిపారు. 2030 నాటికి శూన్య మలేరియా కేసులను సాధించాలనే లక్ష్యంతో జిహెచ్‌ఎంసి జాతీయ మలేరియా నిర్మూలన లక్ష్యాలకు కట్టుబడి పనిచేస్తుందని ఆమె తెలిపారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో అపోలో ఆసుపత్రుల సహకారంతో నిర్వహించిన ఆరోగ్య శిబిరంలో నిపుణులు మలేరియా లక్షణాలు, వ్యక్తిగత రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## అమర వీరులకు నివాళులు.. భారీగా తరలివచ్చిన కార్యకర్తలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సేన (టిఆర్ఎస్) ప్రకటనకు ముందు బంజారాహిల్స్‌లోని తన నివాసంలో కవిత, అనిల్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గన్ పార్క్‌లోని అమర వీరుల స్తూపం వద్దకు వెళ్లి నివాళులర్పించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా మునీరాబాద్‌లోని అద్వయ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకున్నారు. కన్వెన్షన్ సెంటర్ ప్రధాన ద్వారం (కాళోజీ ద్వారం) వద్ద తెలంగాణలోని అన్ని కళారూపాలకు చెందిన కళాకారులు, తెలంగాణ జాగృతి ఘన స్వాగతం పలికారు. పార్టీ ప్రకటన అనంతరం క్యాడర్‌తో కలిసి కల్వకుంట్ల కవిత భారీ ర్యాలీగా హైదరాబాద్‌కు తిరిగివచ్చారు. కాగా పసుపు, నీలం, ఆకుపచ్చ రంగులతో పార్టీ జెండాను రూపొందించారు.

కాగా సౌభాగ్యానికి ప్రతీక అయిన పసుపు, బడుగు, బలహీన వర్గాల సంపూర్ణ వికాసానికి ప్రతీక అయిన నీలం, పాడిపంటలతో అలరారే గ్రామ సీమలకు, రైతులకు ప్రతీకగా ఆకుపచ్చ రంగులను జెండాలో పొందుపరిచారు. పసుపు రంగు మధ్యలో నీలిరంగులో తెలంగాణ మ్యాప్ ముద్రించి ఇంగ్లిష్ అక్షరాల్లో టిఆర్ఎస్ అని ముద్రించారు. కింద ఆకుపచ్చ రంగు పట్టీలో తెలంగాణ రాష్ట్ర సేన పేరును పెట్టారు. కాగా పేరు కింద అసోసియేషన్ అనే చిన్న పదం కూడా ఉన్నది.










## ఫైర్ సేఫ్టీ చట్టం సవరణకు సూచనలు

ఆయా వర్గాలతో అగ్నిమాపక శాఖ వరుస సమావేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో అగ్ని ప్రమాదాల నివారణకు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకునే దిశగా తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ సివిల్ డిఫెన్స్ శాఖ కీలక ముందడుగు వేసింది. ఫైర్ సర్వీసెస్ చట్టం 1999 సవరణల ముసాయిదాను తుది రూపుదిద్దే ప్రక్రియలో భాగంగా పలు కీలక భాగస్వాములతో శనివారం సమావేశం నిర్వహించింది. పట్టణీకరణ వేగం, మౌలిక సదుపాయాల విస్తరణతో పెరుగుతున్న అగ్ని భద్రత సవాళ్లను దృష్టిలో ఉంచుకుని, భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయడం, అనుసరణ వ్యవస్థలను మెరుగుపరచడం, నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ జారీ ప్రక్రియను సులభతరం చేయడం లక్ష్యంగా ఈ సవరణలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో తెలంగాణ గుర్తింపు పొందిన స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్, తెలంగాణ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (తెలంగాణ శాఖ), తెలంగాణ జూనియర్ కాలేజెస్ అసోసియేషన్, తెలంగాణ హోటల్స్ అండ రెస్టారెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో హైదరాబాద్‌లోని ఫైర్ సర్వీసెస్ హెడ్‌క్వార్టర్స్‌లో సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన డైరెక్టర్ జనరల్ శ్రీ విక్రమ్ సింగ్ మాన్ సవరణల ముసాయిదాను వివరంగా వివరిస్తూ, ప్రతిపాదిత మార్పుల అవసరాన్ని పాల్గొన్న ప్రతినిధులకు తెలియజేశారు. ప్రతి అంశంపై స్పష్టత ఇచ్చిన ఆయన, తమ సూచనలు ఆన్‌లైన్ లేదా లిఖితపూర్వకంగా సమర్పించాలని కోరారు.

## తెలంగాణలో బిజెపికి అనుకూల పరిస్థితులు

రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాంచందర్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణలో బిజెపికి అనుకూల పరిస్థితులు నెలకొన్నాయని, కార్యకర్తల ఐక్యత, సిద్ధాంత నిబద్ధతతో రాబోయే రోజుల్లో పార్టీ అధికారంలోకి వస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అధ్యక్షతన పండిట్ దీన్ దయాళ్ ప్రశిక్షణ్ అభియాన్ 2026లో భాగంగా జిల్లాల స్థాయి శిక్షణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిజెఎల్‌పి నాయకుడు మహేశ్వర్ రెడ్డి, ఎంపి ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీతో పాటు పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర పదాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు సైద్ధాంతిక బోధన, క్రమశిక్షణ, రాజకీయ కార్యాచరణపై ప్రతి సంవత్సరం అన్ని స్థాయిల్లో శిక్షణ ఇవ్వడం బిజెపి ప్రత్యేకత అని చెప్పారు. ఇప్పటికే మండల స్థాయిలో 50 వేల మందికి పైగా కార్యకర్తలు శిక్షణ పొందినట్లు తెలిపారు. రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతం రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యిందని, ప్రస్తుతం పార్టీ శిక్షణ కార్యక్రమాలపై దృష్టి సారించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు బిజెపి ప్రజల పక్షాన రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వీరేందర్ గౌడ్, వేముల అశోక్, మీడియా ప్యానలిస్ట్ మహేష్ పాల్గొన్నారు.

## ఫీజులివ్వకుంటే ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుల ముట్టడి

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** పేద విద్యార్థులకు రెండుమూడు రోజుల్లో పెండింగ్ ఫీజులు చెల్లించాలని, లేనిపక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఫీజులు కట్టలేక విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలు, పాలక పార్టీలు వాటాలు పంచుకోవటంలో బిజిగా ఉన్నాయని, విద్యార్థుల ఫీజులపై స్పందించకపోవడం అన్యాయమన్నారు. శనివారం హైదరాబాద్ కాచిగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, బిసి కులాల ఐక్య వేదిక అధ్యక్షులు జి.అనంతయ్య సంయుక్త అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యార్థులను ఫీజులు అడగొద్దని సుప్రీం కోర్టు అనేక తీర్పులిచ్చిందని గుర్తు చేశారు. కానీ, విద్యార్థులను ఫీజులు అడగొచ్చని హైకోర్టు సింగిల్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులివ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ఉత్వర్వులు అమలుచేస్తే రాష్ట్రంలో అగ్గిరాజేస్తామని హెచ్చరించారు. డబ్బుల్లేవని అంటున్న ప్రభుత్వానికి అప్పు కావాలంటే తాను అడిగిస్తా అని సవాల్ విసిరారు. అన్ని రాజకీయ పార్టీల బిసి నేతలు ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి ఫీజులు వచ్చేలా చూడాలన్నారు. ఫీజు ఉద్యమంలో కాలేజీ యాజమాన్యాలు కూడా భాగస్వామ్యం కావాలని కృష్ణయ్య పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.రాజేందర్, విద్యార్థి సంఘం కన్వీనర్ మోదీ రాందేవ్, నేతలు వరప్రసాద్, కృష్ణ యాదవ్, భీమరాజు, జి.అంజి, సతీశ్, బలరాం పాల్గొన్నారు.

## బాగా పని చేయండి.. ఎక్సైజ్ శాఖకు గౌరవం తీసుకురండి..



-ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీములు బాగా పని చేసి ఎక్సైజ్ శాఖకు మంచి పేరు తీసుక రావాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం పిలుపు నిచ్చారు. గంజాయి, డ్రగ్స్ పట్టుకున్న 20 ఎక్సైజ్ టీమ్‌లకు ఆబ్కారీ భవన్ లోని డైరెక్టర్ చాంబరులో శనివారం నగదు ప్రోత్సహాకాలను షానవాజ్ ఖాసీం చేతుల మీదుగా ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ అంజన్‌రావు, డిప్యూటీ కమిషనర్ ప్రణవీ, ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్ జి. గణేష్‌తోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్, డిటిఎఫ్,ఎక్సైజ్ టీమ్‌ల సిఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి




**ప్రజాపక్షం/సైదాబాద్:** తమ ఇంటి పరిసరాలతో పాటు నీటి నిలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచుకొని దోమలను అరికట్టెందుకు చర్యలు తీసుకోవాలని చార్మినార్ జెడ్‌సీ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మాదన్నపేట్ యూ పీహెచ్‌సీ కేంద్రం వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జెడ్‌సీ జెండా ఊపి అవగాహనా ర్యాలీని ప్రారంభించారు.కార్యక్రమంలో సంతోష్‌నగర్ డిసి మంగ తాయారు, మలేరియా ఎస్‌ఈ ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కోదండరామ్‌కు శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** తెలంగాణ ఉద్యమ రథసారథి, తెలంగాణ జన సమితి వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ కోదండరామ్ మరోసారి ఎమ్మెల్సీగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పలువురు ఆయనకు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీగా కోదండరాం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలంగాణ జనసమితి బిసి కన్వీనర్ అంబర్‌పేట్ జస్వంత్ తెలిపారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజాపక్షం/ఫలక్‌నుమా:** ఆర్‌టిసి చర్చలు సఫలమై.. సమ్మె విరమించడంతో ఫలక్‌నుమా డిపో వద్ద చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి బోయా నాగేష్ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మిఠాయిలు పంచుకున్నారు.

## బెస్ట్ హెచ్‌ఆర్ కన్సల్టింగ్ పార్ట్‌నర్స్ అవార్డు



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** ప్రతిష్టాత్మక బెస్ట్ హెచ్‌ఆర్ కన్సల్టింగ్ పార్ట్‌నర్ ఇన్ ఫార్మా ఇండస్ట్రీ అవార్డును వెర్చ్ కన్సల్టింగ్ ఎల్‌ఎల్‌పి వ్యవస్థాపకుడు డాక్టర్ చిక్కాల వేణుగోపాలరావుకు ఆరోగ్య, వైద్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అందజేశారు. ఈ సందర్భంగా చిక్కాల వేణుగోపాలరావు మాట్లాడుతూ, ఈ గుర్తింపు మా భాగస్వాములకు, క్లయింట్‌లకు అనుకూల హెచ్‌ఆర్ పరిష్కారాలు అందించాలనే మా నిబద్ధతను ప్రతిబింబిస్తుందని తెలిపారు.

## ఘనంగా ఫార్మసీ ఆఫీసర్స్ దినోత్సవం




**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** తెలంగాణ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయంలో ఫార్మసీ ఆఫీసర్స్ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్ ఆధ్వర్యంలో సభ్యులు కేక్ కట్ చేసి, స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ డా.అనురాధ, అడిషనల్ డైరెక్టర్ సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్‌పై అవగాహన



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** సైబర్ మోసాలపై పోలీసులు సిద్ధార్థనగర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మారుతి నీరజ్ గ్రాండ్యూర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డీసీపీ ఎ.రమణారెడ్డి,అదనపు డీసీపీ కె.శ్రీకాంత్, డీఐ శ్రీనివాస్, మధురానగర్ ఎస్‌హెచ్‌ఓ హెచ్.ప్రభాకర్, ఎస్‌ఐలు సుష్మ, భానుచందర్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాట్ల కోసం ఎదురుచూపులు



**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** భూ వ్యవహారం తేలకపోవడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు లబోదిబోమంటున్నారు. బండ్లగూడ మండలం సర్వే నెం 223 కందికల్ గేట్‌లోని భూ వివాదానికి 1984లో పరిష్కారం లభించింది. ఈ క్రమంలోనే భూమి పొందిన సాధుసింగ్, బానిబేగం, యూనిస్, ఇక్బాల్ సంబంధిత భూమిలో ప్లాట్లు చేసి విక్రయించారు. అయితే బానిబేగంతో విబేధాలు రావటంతో వ్యవహారం కోర్టుకు చేరింది. ఇంతలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తమకు పొజిషన్ చూపించాలని ఒత్తిడి తెస్తున్నారు. కాగా సాధుసింగ్, ఇక్బాల్, ఈశ్వర్, హర్షదీప్ సింగ్ కాలయాపన చేస్తూ తమకు ప్లాట్లు ఇవ్వటం లేదని మీడియా ముందుకు వచ్చామని.. ఇందులో భాగంగానే అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందని బాధితులు తెలిపారు.

## కళలు వికసిస్తే సంస్కృతి వికాసం

### 'చార్కోల్ స్టోరీస్' ప్రదర్శన ప్రారంభోత్సవంలో దర్శకులు బి.నర్సింగ్‌రావు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** కళలు వికసిస్తే సంస్కృతి వికసిస్తుందని ప్రముఖ సినీ దర్శకులు, చిత్రకారుడు బి.నర్సింగ్ రావు అన్నారు. కళలు సాధించడం మాత్రమే కాక వాటిని ఆస్వాదించడం కూడా ఒక కళేనన్నారు. శనివారం హైదరాబాద్‌లోని లమాకాన్‌లో బాలిచెలిమి ఆధ్వర్యాన జరిగిన నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన బాల ప్రతిభాశాలి రిక్కీతేజ్ రూపొందించిన "చార్కోల్ స్టోరీస్" కళా ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సింగ్ రావు మాట్లాడుతూ పౌరాణిక అంశాలపై రిక్కీ తేజ్ చూపిస్తున్న సహజసిద్ధమైన, జీవంతో నిండిన చార్కోల్ చిత్రాలను ప్రశంసించారు. భవిష్యత్తులో అతను గొప్పస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు విద్యతోపాటు నృత్యం, మట్టి కళలు, సంగీతం, క్రీడలు, ఇతర సృజనాత్మక సహ పాఠ్య కార్యకలాపాలను అభ్యసించాలని సూచించారు. రిక్కీ తేజ్ తండ్రి కట్టా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రదర్శన విజయంతంగా నిర్వహించిన బాలచెలిమి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కల్వకుర్తి సీనియర్ జర్నలిస్టు వెంకటేశ్వరరావు, కార్టూనిస్ట్ నర్సిం, గ్రూప్– 1 అధికారి సాహితీ, ప్రధానోపాధ్యాయులు వేముల సైదులు, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిని ఎదుర్కొనేలా ప్రజలకు పోత్సాహం

### ఆర్‌టిఐ సాధన కమిటీ జాతీయ చైర్మన్ డా.చంటి ముదిరాజ్



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** సమాచారం హక్కు చట్టం (ఆర్‌టిఐ) ద్వారా రాష్ట్రంలో జరిగే అవినీతిని ఎదుర్కోనేందుకు ప్రజలను ప్రోత్సహించడమే సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) సాధన కమిటీ ముఖ్య ఉద్దేశమని కమిటీ జాతీయ చైర్మన్ డా.చంటి ముదిరాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కమిటీ జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్క నవీన్‌కుమార్‌ను కమిటీ జాతీయ సహాయ కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. అనంతరం చంటి ముదిరాజ్ మాట్లాడుతూ ఆర్‌టిఐపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ చట్టాన్ని సమర్థ అమలుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామన్నారు. తమ కృషి ఫలితంగా కమిషనర్లను నియమించుకొన్నామని తెలిపారు. సమావేశంలో కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు సూర స్రవంతి, రాష్ట్ర అధికార ప్రతినిధి కాశీ సతీశ్ కుమార్, ఉపాధ్యక్షులు ప్రకాశ్ పటేల్, కార్యదర్శి అజయ్, సహాయ కార్యదర్శులు శివ కుమార్, అరవింద్ స్వామి, జిల్లాల నేతలు పాల్గొన్నారు.

## ఫైర్ సేఫ్టీ చట్టం సవరణకు సూచనలు

### -ఆయా వర్గాలతో అగ్నిమాపక శాఖ వరుస సమావేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో అగ్ని ప్రమాదాల నివారణకు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకునే దిశగా తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ సివిల్ డిఫెన్స్ శాఖ కీలక ముందడుగు వేసింది. ఫైర్ సర్వీసెస్ చట్టం1999 సవరణల ముసాయిదాను తుదిరూపు దిద్దే ప్రక్రియలో భాగంగా పలు కీలక భాగస్వాములతో శనివారం సమావేశం నిర్వహించింది.పట్టణీకరణ వేగం, మౌలిక సదుపాయాల విస్తరణతో పెరుగుతున్న అగ్ని భద్రత సవాళ్లను దృష్టిలో ఉంచుకుని, భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయడం, అనుసరణ వ్యవస్థలను మెరుగుపరచడం, నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ జారీ ప్రక్రియను సులభతరం చేయడం లక్ష్యంగా ఈ సవరణలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో తెలంగాణ గుర్తింపు పొందిన స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్, తెలంగాణ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (తెలంగాణ శాఖ), తెలంగాణ జూనియర్ కాలేజెస్ అసోసియేషన్, తెలంగాణ హోటల్స్ అండ రెస్టారెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో హైదరాబాద్‌లోని ఫైర్ సర్వీసెస్ హెడ్‌క్వార్టర్స్‌లో సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన డైరెక్టర్ జనరల్ శ్రీ విక్రమ్ సింగ్ మాన్ సవరణల ముసాయిదాను వివరంగా వివరిస్తూ, ప్రతిపాదిత మార్పుల అవసరాన్ని పాల్గొన్న ప్రతినిధులకు తెలియజేశారు. ప్రతి అంశంపై స్పష్టత ఇచ్చిన ఆయన, తమ సూచనలు ఆన్‌లైన్ లేదా లిఖిత పూర్వకంగా సమర్పించాలని కోరారు.

## కాలజ్ఞాని అంశాలు సామాజిక కోణాలు



**ప్రజాపక్షం/ఉస్మానియా వర్సిటీ:** కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వెలువరించిన అంశాలు సామాజిక కోణం, ఆధ్యాత్మిక పరిజ్ఞానంతో సృష్టించిన గొప్ప సాహితీప్రవచనాలని పలువురు వక్తలు కొనియాడారు. ఓయూ బిసి సెల్ ఆధ్వర్యంలో ఓయూ సైన్స్ కాలేజీ లో వీర బ్రహ్మేంద్ర స్వామిపై ధర్మనిధి ప్రసంగం జరిగింది. సాహిత్య పరిశోధకులు డా.పి.భాస్కర యోగి ప్రధాన ప్రసంగం చేశారు. ఓయూ బీసీ సెల్ డైరెక్టర్ డా.జే.మాధవి, వీర బ్రహ్మేంద్ర ఆధ్యాత్మిక ఆత్మ సాక్షాత్కార సంస్థ అధ్యక్షుడు అడ్లూరి రవీంద్రాచారి, రావుల గిరిధర్, సైంటిస్ట్ కృష్ణమూర్తి తదితరులు అతిధులుగా విచ్చేసి ప్రసంగించారు.

## ఆటో డ్రైవర్ల రణరంగం



**ప్రజాపక్షం/గోషామహల్:** ప్రశాంతంగా ఉండే మోజాంజాహీ మార్కెట్ చౌరస్తా శనివారం ఒక్కసారిగా రణరంగాన్ని తలపించింది. తమ బతుకులు రోడ్డున పడుతున్నాయంటూ ఆటో డ్రైవర్లు కదం తొక్కారు. సుమారు 200 ఆటోలతో నాలుగు రోడ్ల కూడలిని దిగ్బంధించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిప్పులు చెరిగారు. నడిబొడ్డున ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయింది. ఓవైపు వేసవితాపం.. మరో వైపు ఆటో డ్రైవర్ల నిరసన సెగలు కక్కుతున్న వేళ.. అందరూ చూస్తుండగానే ఓ ఆటో డ్రైవర్ తన ఆటో పైకెక్కి పెట్రోల్ పోసుకున్నాడు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆత్మహత్యకు యత్నించడంతో అక్కడున్న వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే అప్రమత్తమైన తోటి డ్రైవర్లు అతన్ని పట్టుకుని కిందకు దించడంతో పెను ప్రమాదం తప్పింది. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన జనం అల్లాడిపోయారు. ఆటోల దిగ్బంధనంతో కోఠి, పుత్లీబౌలి, జాంబాగ్, బేగంబజార్, బ్యాంక్ స్ట్రీట్, ఉస్మాన్‌గంజ్, అఫ్జల్‌గంజ్, అబిడ్స్, మాలకుంట మార్గాలన్నీ పూర్తిగా బ్లాక్ అయ్యాయి. బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయి సామాన్య జనం నరకం చూశారు. గంటల తరబడి ట్రాఫిక్ జామ్ కావడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.పరిస్థితి పూర్తిగా చేయిదాటడంతో పోలీసులు రంగంలోకి దిగి ఆందోళనకారులను శాంతింప చేశారు. బలవంతంగా వారిని అక్కడి నుంచి తరలించారు.

## 'రాజా శివాజీ' సినిమా పేరును.. ఛత్రపతి శివాజీగా మార్చాలి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** రితేష్ దేశ్ముఖ్, జెనీలియా దేశ్ముఖ్ నిర్మాణంలో మే 1న విడుదల కానున్న బాలీవుడ్ చిత్రం 'రాజా శివాజీ' టైటిల్‌పై శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సినిమా పేరులో గౌరవప్రదమైన 'ఛత్రపతి' అనే పదాన్ని చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ సీఎస్ చవాన్ ఫౌండేషన్ ప్రతినిధులు నాగబాల, సురేష్ కుమార్, మదన్ గుప్తా తదితరులతో కలిసి మాట్లాడారు.. శివాజీ మహారాజ్ గౌరవానికి భంగం కలగకుండా, చారిత్రక ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా సినిమా ఉండాలన్నారు. సినిమా పేరులో తప్పనిసరిగా 'ఛత్రపతి' అనే బిరుదును చేర్చాలని డిమాండ్ చేశారు. నిర్మాతలు వెంటనే స్పందించి సినిమా విడుదలకు ముందే టైటిల్లో మార్పులు చేయాలని, లేనిపక్షంలో సినిమా విడుదలను నిలిపివేయాలని కోరుతూ ముంబై హైకోర్టులో స్టే పిటిషన్ దాఖలు చేస్తామని హెచ్చరించారు. మీడియా సమావేశంలో ఫౌండేషన్ ప్రతినిధులు జగన్‌మోహన్, లడ్డూ యాదవ్, నితిన్ నంద్కర్, అనంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం, హక్కులపై అవగాహన



**ప్రజాపక్షం / సిటీ బ్యూరో:** ఖైదీలకు లభించే ఉచిత న్యాయ సహాయం, వారి హక్కులు, బెయిల్ తదితర విషయాలపై జిల్లా లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటి (సెషన్స్ డివిజన్) సెక్రటరీ పి.అరుణ కుమారి వారికి వివరించారు. చంచల్ గూడ జైలును శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖైదీలకు వారి సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలో మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు ఎన్.శివకుమార్,కాళిదాస్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుడు డా. హిప్నో కమలాకర్

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి అంకితభావంతో సేవలందించిన ధన్యజీవి దివంగత డా.హిప్నో కమలాకర్ అని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా. హిప్నో పద్మా కొనియాడారు. డా. హిప్నో కమలాకర్ జయంతి సందర్భంగా కవాడిగూడలో క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

## జర్నలిస్టులు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలి

### కలెక్టర్ హరిచందన దాసరి



**ప్రజాపక్షం / సిటీ బ్యూరో:** జర్నలిస్టులు ఆరోగ్య శిబిరాలను తప్పకుండా వినియోగించుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజులు' కార్యక్రమంలో భాగంగా శనివారం బల్కంపేట నేచర్ క్యూర్ ఆసుపత్రిలో సమాచార పౌరసంబంధాల శాఖ, జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు మెగా హెల్త్‌క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్‌ను ప్రారంభించిన కలెక్టర్ హరిచందన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జర్నలిస్టులు చేస్తున్న అమూల్యమైన సేవలకు గుర్తింపుగా ఈ శిబిరం నిలుస్తుందన్నారు. జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తారన్నారు. ఈ క్యాంప్‌లో జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి శిబిరాన్ని సందర్శించి సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ మలేరియా దినోత్సవం ఎంఎంసి అవగాహన కార్యక్రమాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) పరిధిలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు. మలేరియా నివారణ, దోమల నియంత్రణపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టారు. పలు సర్కిళ్లలో అధికారులు, సిబ్బంది, ఆశా వర్కర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, స్థానికులు పాల్గొని ర్యాలీలు నిర్వహించారు. మలేరియా వ్యాప్తి కారణాలు, నివారణ చర్యలు, దోమల ఉత్పత్తి నియంత్రణపై ప్రచారం చేపట్టారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా టైర్లు, కూలర్లు, నీటి ట్యాంకులు, పూల కుండీలు వంటి ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎంఎంసి పరిధిలో ఫాగింగ్, యాంటీ లార్వా ఆపరేషన్లు, ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

## హెచ్–1బి పై మూడేళ్ల నిషేధానికి రిపబ్లికన్ల డిమాండ్

**వాషింగ్టన్:** హెచ్–1బి వీసాల జారీపై మూడేళ్ళ పాటు నిషేధం విధించాలని కోరుతూ అమెరికా పార్లమెంటులో రిపబ్లికన్‌పార్టీకి చెందిన కొందరు ఎంపీల బృందం ఒక బిల్లును ప్రవేశపెట్టింది. సాధారణంగా ఈ వీసాలవల్ల అమెరికాలో ప్రయోజనం పొందేది ఎక్కువగా భారతీయులే గనుక గతంలో ఎన్నడూలేనివిధంగా రిపబ్లికన్లు అమెరికా కాంగ్రెస్‌లో ఈ బిల్లు ప్రవేశపెట్టడం ద్వారా అతిపెద్ద సమస్య సృష్టించారు. ప్రస్తుతం ఏటా 65,000 వీసాలకు మాత్రమే ట్రంప్ పరిమితం చేయగా, ఇప్పుడు ఈ బిల్లులో ఈ వీసాల సంఖ్యను కేవలం25,000 మాత్రమే పరిమితం చేయాలని, వారి వార్షిక వేతనాన్ని రెండు లక్షల డాలర్లకు పరిమితం చేయాలని రిపబ్లికన్ ఎంపీలు డిమాండ్ చేశారు.

# జనగణన పనుల్లో కచ్చితత్వం అవసరం

## ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి





ప్రజాపక్షం/హైదరాబాద్ : జనగణన ప్రక్రియలో సమాచార సేకరణను అత్యంత కచ్చితత్వంతో, బాధ్యతాయుతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు. ఎంఎంసి ఆధ్వర్యంలో నిర్వహించిన జనగణన శిక్షణ కార్యక్రమం మూడో రోజు సందర్భంగా సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లకు మార్గదర్శకాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డేటా సేకరణలో పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్వే విధానాలు, ఫీల్డ్ స్థాయి బాధ్యతలు, సమాచారం నమోదు పద్ధతులపై సమగ్ర అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమం ద్వారా సిబ్బందికి అవసరమైన నైపుణ్యాలు, పరిజ్ఞానం అందించడం లక్ష్యమని తెలిపారు.

### విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు క్రీడల్లో రాణించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆకాంక్షించారు. ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో సమ్మర్ కోచింగ్ క్యాంప్2026ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. మైదానాలు, పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 25 నుంచి మే 31 వరకు మూడు జోన్లలో 200 కేంద్రాల్లో 42 క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

### మహిళ సాధికారతకు ప్రాధాన్యం

మహిళల సాధికారత, ఆర్థికాభివృద్ధికి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) పెద్దపీట వేస్తుందని కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఎంఎంసి పరిధిలో మహిళలతో సమావేశాలు నిర్వహించారు. పార్కుల నిర్వహణపై స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గడ్డి కత్తిరింపు, మొక్కల ట్రిమ్మింగ్, హరిత ప్రాంగణాల సంరక్షణ వంటి అంశాల్లో వారికి అవగాహన కల్పించారు. కాప్రా పరిధిలోని ఏఎస్ రావు నగర్ జపనీస్ థీమ్ పార్క్ వద్ద విజయ డైరీ పార్లర్‌ను ప్రారంభించారు. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ సహకారంతో మహిళలకు ఆహార సేవలు, పరిశుభ్రత ప్రమాణాలపై ఐదు రోజుల శిక్షణ పూర్తి చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందించారు. మహిళలకు జీవనోపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారిని బలోపేతం చేయాలని లక్ష్యంగా నిర్ధేశించామన్నారు.

# బిఎల్‌ఓలు ఓటర్ల వివరాలు, మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం



ప్రజాపక్షం/షాద్‌నగర్: బిఎల్‌ఓలు ఇంటింటికి వెళ్ళి ఓటర్ల వివరాలను త్వరగా పూర్తి చేయడంతోపాటు మ్యాపింగ్ ప్రక్రియలో వేగం పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ అడిషనల్ సిఇఒ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. శనివారం ఫరూర్‌నగర్ ఎంపిడిఒ సమావేశ మందిరంలో 84 షాద్‌నగర్ శాసన సభ నియోజకవర్గానికి సంబంధించి షాద్‌నగర్ ఆర్‌డిఒ సరిత, తహసీల్దార్ నాగయ్యల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల నమోదు ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని, మ్యాపింగ్ ప్రక్రియలో భాగంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బిఎల్‌ఒల సహాయం తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సునీత, విఆర్‌ఓలు, బిఎల్‌ఓ సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

# ఉచిత వైద్యశిబిరం విజయవంతం



ప్రజాపక్షం/కేశంపేట: గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అంధించేందుకు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శనివారం కేశంపేట మండల పరిధిలోని నిర్ధవెల్లి గ్రామ పంచాయతీ శ్యామ్‌రావు తండాలో షాద్‌నగర్ విజయ కార్డియాక్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చందులాల్ రాథోడ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉప సర్పంచ్ సవూర్ అమేర్, వార్డుసభ్యులు రమేష్, నాగరాజు, చంద్రయ్య, చెన్నయ్య, వెంకటమ్మ, మల్లయ్య, రిజ్వానాభేగం, మోహిజ్ పాల్గొన్నారు.

# కరెంటు కష్టాలు తీర్చిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/కొందుర్గు: రైతులు ఎదుర్కొంటున్న కరెంటు కష్టాలను తీర్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. శనివారం కొందుర్గు మండల పరిధిలోని తంగిళ్ళపల్లి గ్రామంలో విద్యుత్ కష్టాలకు చెక్ పెట్టడంతోపాటు 6వ వార్డులో కొత్తగా మినీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్యలను నియంత్రించినందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డుసభ్యులు భ్యాగరి కుమార్ రాపోలు, వెంకటేష్, మాజీ వార్డు సభ్యుడు వద్ల నారాయణ, బైకని శివ, ఎద్దు నర్సింగ్, ఎద్దు సురేష్ పాల్గొన్నారు.

# ఫ్యూచర్‌సిటీ లేఅవుట్‌పై అవగాహన



ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని వివిధ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలిపిన గ్రామాల్లో లేవుట్లపై పంచాయతీ కార్యదర్శులు అధికారులు నియమ నిబంధనలను తెలుసుకోవాలని ఫ్యూచర్ సిటీ డిప్యూటీ డైరెక్టర్ స్నేహ అన్నారు. శనివారం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీలో లే అవుట్, బిల్డింగ్ రూల్స్ విధి విధానాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మి నారాయణ, ఎపిఒ శ్రీలత, ఎపిఒలు. పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీని రద్దు చేయాలి



ప్రజాపక్షం/యాచారం : కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఫ్యూచర్ సిటీని రద్దు చేయాలని జాతీయ మహిళా హక్కుల వేధిక కమిటీ సభ్యులు ఆశాలత డిమాండ్ చేశారు. గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులు చేస్తున్న దీక్షలకు శనివారం ఆమె మద్దతు తెలిపారు. ఈ సంధర్బంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను నష్టం చేయాలని చూస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ఫార్మాసిటీ జీవో నంబర్ 31 ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో కుర్మిద్ద గ్రామ సర్పంచ్ నీలం శ్రీవిధ్య,పార్మాసిటి వ్యతిరేఖ పోరాట సంఘం నాయకులు తదితరులు పాల్గోన్నారు.

# హస్తినాపురం జడ్‌పి రోడ్డులో అక్రమ ఫుట్‌పాత్‌లు తొలగింపు



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : హస్తినాపురం డివిజన్‌లోని తెలంగాణ చౌరస్తా నుంచి టికెఆర్ కమాన్ వరకు రోడ్డు ఇరువైపుల రోడ్డు అక్రమంగా ఫుట్‌పాత్‌లను మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు శనివారం టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రతాప్ పర్యవేక్షణలో జెసిబితో తొలగించారు. రోడ్డు ఇరువైపుల ఉన్న అక్రమ నిర్మాణాలు పూర్తి స్థాయిలో తొలగించడం జరిగిందన్నారు. రోడ్డు ఇరువైపుల దుకాణాలు, మట్టికుప్పలు, షాపుల బోర్డులు రోడ్డును అక్రమించడం ద్వారా రోడ్డుపై తరుచుగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తడం జరుగుతుందని ఫిర్యాదులు రావడం జరిగిందని ఎసిపి ప్రతాప్ తెలిపారు. రోడ్లపై, ఫుట్‌పాత్‌లను అక్రమించరాదని, అక్రమిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అర్చన, చైన్‌మెన్‌లు, న్యాక్ బృదం పాల్గొన్నారు.

# త్వరితగతిన ఫ్లైఓవర్ పనులు పూర్తి : కమిషనర్ సృజన



ప్రజాపక్షం/హైదరాబాద్ : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) కమిషనర్ సృజన త్రిబుల్ ఐటి ఖాజాగూడ జంక్షన్‌లలో నిర్మాణంలో ఉన్న హెచ్‌సిటీ ఫ్లైఓవర్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు పురోగతిని సమీక్షిస్తూ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం ప్రారంభానికి ముందే పునాది పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రతి పనిని అంశాల వారీగా సమీక్షిస్తూ ఫీల్డ్ ఇంజనీర్లు మైక్రోలెవల్ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించడంలో, కనెక్టివిటీ పెంపులో ఈ ఫ్లైఓవర్లు కీలకమని కమిషనర్ సృజన తెలిపారు.

### కాలనీల అభివృద్ధి, నీటి సంరక్షణపై సమీక్ష సమావేశం

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ సృజన, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాలనీల అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, పర్యావరణ పరిరక్షణపై సుదీర్ఘంగా చర్చించారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తూ కాలనీలను జీరో వేస్ట్ జోన్లుగా మార్చేందుకు కాలనీ సంక్షేమ సంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# జిహెచ్‌ఎంసి వేసవి క్రీడా శిబిరాలు ప్రారంభం

ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడల శిబిరాలు –2026 శనివారం ప్రారంభమయ్యాయి. ఈ శిభిరాలు వచ్చే నెల మే 31 వరకు 37 రోజుల పాటు నిర్వహించనున్నారు. నగర వ్యాప్తంగా 752 కేంద్రాల్లో 44 క్రీడా విభాగాల్లో శిక్షణ అందిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 6 నుండి 8 గంటల వరకు జరిగే ఈ శిబిరాలు 6 నుండి 16 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. అథ్లెటిక్స్ నుంచి యోగా వరకు అనేక క్రీడల్లో శిక్షణ అందిస్తున్నారు. మే 5 నుంచి 11 వరకు జోన్ వారీగా స్పోర్ట్స్ క్విజ్ పోటీలు, మే 18 నుంచి 23 వరకు వివిధ క్రీడల్లో టోర్నమెంట్లు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా జిహెచ్‌ఎంసి చర్యలు చేపట్టింది. క్రీడల శిభిరాలలో పాల్గొనే వారు జిహెచ్‌ఎంసి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చు అని అధికారులు తెలిపారు.

# పకడ్బందీగా మ్యాపింగ్ ప్రక్రియ

## రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజాపక్షం/రంగారెడ్డి: ప్రత్యేక సమగ్ర ఓటర్ల జబితా సవరణలో మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డిఒలు, అన్ని మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల బూత్ స్థాయి అధికారులు 2002 ఓటర్ల జాబితాలో ఎన్నికల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. బిఎల్ ఒలు ప్రతి ఇంటికి వెళ్లి 18 సంవత్సరాల వయసు పైబడిన వారి వివరాలు సేకరించాలని, నిబంధనల ప్రకారం మ్యాపింగ్‌తో పాటు డూప్లికేట్ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను గుర్తించి ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పరిశీలించి వివరాలను ధ్రువీకరించి తొలగించాలనితెలిపారు. ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం పై ప్రజలలో అవగాహన కల్పించాలని ఓటర్లను చైతన్యపరచాలని తెలిపారు. జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు కె.శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, సిపిఒ సౌమ్య, ఇడిఎస్‌సి కార్పొరేషన్ జొన్నలగడ్డ పద్మావతి, ఆర్‌డిఒలు, తహసీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మలేరియా నిర్మూలనకు కృషి

## రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితదేవి




ప్రజాపక్షం/రంగారెడ్డి: మలేరియా నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.లలితదేవి అన్నారు. శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ఆరోగ్యకేంద్రం నార్సింగిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ దోమలతోనే మలేరియా, డెంగీ, మెదడు వాపు, బోదవ్యాధితోపాటు చికెన్‌గున్యా వంటి వ్యాధులు వస్తాయన్నారు. నివాసాలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు. దోమలతో సోకే వ్యాధులపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్యసిబ్బందిపై ఉందన్నారు. ప్రజల్లో ఆరోగ్య సంరక్షణ పట్ల అవగాహన పెరగడం, గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడంతో మలేరియా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. మలేరియా వ్యాధిని వ్యాపింపజేసే దోమల పెరుగుదలను అరికట్టడానికి నిరంతరం జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ లలితాదేవి సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మలేరియా నిర్మూలనలో ప్రతిఒక్కరు భాగస్వామ్యం కావాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలితాదేవి పిలుపునిచ్చారు. అనంతరం టిబి రోగుల కోసం పోషకాహాయం అందించేందుకు టిబి న్యూట్రిషన్ కిట్‌ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ సిహెచ్ రాకేష్, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ పూనం, డిస్టిక్ ప్రోగ్రాం ఆఫీసర్ అక్రమ్, సబ్ యూనిట్ ఆఫీసర్ టి.నారాయణ, కె.జగన్, వైద్య సిబ్బంది, నార్సింగి పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

# వేసవి సెలవుల్లో పిల్లలు, యువతకు క్రీడా శిబిరాలు




## ఎల్‌బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : వేసవి సెలవుల్లో యువత క్రీడల వైపు మక్కువ చూపాలని, ఫిట్‌నెస్ నైపుణ్యాలలో ఉనికి చాటాలని ఎల్‌బి నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వనస్థలిపురం డివిజన్‌లోని చత్రపతి శివాజీ గ్రౌండ్‌లో మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ సుదీర్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు, యువతకు క్రీడలు, ఫిట్‌నెస్, నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఇలాంటి శిక్షణ శిబిరాలు ఉపయోగకరమని తెలిపారు. ఈ శిబిరాలు పిల్లలలో శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధికి దోహదపడుతాయన్నారు. పిల్లలలో టాలెంట్ పెంపొందించడం, సెలవుల్లో ఖాళీగా ఉండకుండా సమయాన్ని ఉపయోగకరంగా వినియోగించడం, శారీరక దృఢత్వం పెరగడం. క్రమశిక్షణ, టీమ్‌వర్క్ నేర్చుకోవడం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌రెడ్డి, అధికారులు అశోక్, నాగేందర్, వనస్థలిపురం డివిజన్ మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా, కటికరెడ్డి అరవింద్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఫ్యూచర్‌సిటీ పోలీసు కమిషనర్‌గా తరుణ్‌జోషి నియామకం



ప్రజాపక్షం/రంగారెడ్డి: ఫ్యూచర్‌సిటీ నూతన పోలీసు కమిషనర్‌గా డాక్టర్ తరుణ్‌జోషి నియమితులయ్యారు. 2004 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం అవినీతి నిరోధకశాఖ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన జి.సుధీర్‌బాబు ఈ నెలాఖరుతో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో తరుణ్‌జోషిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పంజాబ్‌కు చెందిన తరుణ్ జోషి పటియాలలోని ప్రభుత్వ డెంటల్ కాలేజీ అండ్ హాస్పిటల్ నుంచి బిడిఎస్ పూర్తి చేశారు. 2004లో సివిల్ సర్వీసెస్ ఉత్తీర్ణులైన ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో ఐపిఎస్ అధికారిగా నియమితులయ్యారు. తెలంగాణ కేడర్‌లో 2014 నుంచి 2016 వరకు ఆదిలాబాద్ ఎస్పీగా పని చేశారు. హైదరాబాద్ సెంట్రల్ జోన్ డిసిపి గా, హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ జాయింట్ సిపి గా పని చేశారు. ఆ తర్వాత ఏసీబీ డైరెక్టర్‌గా,లోక్‌సభ ఎన్నికల సమయంలో రాచకొండ పోలీసు కమిషనరేట్ సిపి గా పని చేశారు. ప్రస్తుతం ఫ్యూచర్‌సిటీ పోలీసు కమిషనరేట్ సిపి గా నియమితులయ్యారు. ఒక వైపు పోలీసుగా విధులు నిర్వర్తిస్తూనే మరో వైపు ఉన్నత విద్యను కూడా అభ్యసిస్తున్నారు. ఇప్పటికే ఓయూ నుంచి పోలీసు మేనేజ్‌మెంట్ విభాగంలో మాస్టర్స్ పూర్తి చేశారు. ఆపై ఎల్‌ఎల్‌బీలో చేరిన ఆయన ఓయూలోనే టాప్ ర్యాంకర్‌గా నిలిచారు.

# సంక్షేమ పథకాలు సద్వినియోగం

## ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం : ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి లబ్ధిదారులకు సూచించారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శాస్త్ర గార్డెన్‌లో జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఇబ్రహీంపట్నం,ఆదిభట్లకు చెందిన 159మంది లబ్ధిదారులకు 1,59,18,444 రూపాయల కల్యాణలక్ష్మి, షాధ్ ముబారక్ చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా పరిష్కరించి నియోజక వర్గాన్ని ఆదర్శ నియోజక వర్గంగా అభివృద్ధి చేస్తునని తెలిపారు. మండలంలో నెర్రపల్లి, దండుమైలారం, ముకునూర్, పోల్కంపల్లి గ్రామాలలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సుడిగాలి పర్యటన చేసి రూ.2కోట్ల 15లక్షల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలతో పాటు గ్రామలలో రోడ్లు, అండర్ డ్రైనేజి నిర్మాణ పనులకు, తాగునీటి సౌకర్యం కోసం, విద్యతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు కల్పించటానికి అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ మంఖాల కరుణాకర్, సర్పంచ్‌లు హేమలతశ్రీహరి, నరేష్ గౌడ్, శిల్పా,కొండల్ గౌడ్, వివిధ శాఖల అధికారుల, మున్సిపల్ కమీషనర్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు,

# జాతరలో సర్పంచ్‌పై మాజీ సర్పంచ్ దాడి



ప్రజాపక్షం/షాద్‌నగర్: ఈదమ్మ దేవత జాతరలో అధికార కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ బందయ్య. మాజీ సర్పంచ్ వర్గీయుల మధ్య తీవ్ర ఘర్షణ చోటు చేసుకున్న సంఘటన రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని ఎల్కగూడ గ్రామంలో చోటు చేసుకుంది. శనివారం ఎల్కగూడ గ్రామంలో ఈదమ్మ దేవత జాతర సర్పంచ్ బందయ్య నిర్వహిస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాంరెడ్డి వచ్చి ఘర్షణకు దిగారు. తక్కువ కులం అయిన సర్పంచ్ ఈదమ్మ దేవత జాతర ఎలా నిర్వహిస్తారంటూ రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తులు బందయ్యను తీవ్రంగా గాయపరిచారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని సంఘటనలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుపుకున్నారు. దాడిలో తీవ్రంగా గాయపడిన సర్పంచ్ బందయ్య ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యసేవలు అంధించాలని ప్రభుత్వ వైద్యులకు సూచించారు. సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పడంతోపాటు ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తులకు కఠినంగా శిక్షించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో జాతర నిర్వహిస్తున్న నేపథ్యంలో ఓర్వలేకనే దాడికి పాల్పడ్డారని సర్పంచ్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే ముందు రోదిస్తూ మొరపెట్టుకున్నారు. ఎల్కగూడెం బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్ఐ విజయ్‌కి ఎమ్మెల్యే సూచించారు.



## అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు

### కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయటంలో విధిగా 252 జిఒ నియమ నిబంధనలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేంద ర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా అక్రిడిటేషన్ కమిటి సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించి ఆయన పలు సూచనలు చేసారు. మీడియా ప్రతినిధులు సమాజంలో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పథకాలను చేరవేయటంలో కీలకపాత్ర వహిస్తారని, ఈ విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ మీడియా వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు.

## గిన్నీస్ వరల్డ్ రికార్డ్ తైక్వాండో పోటీలకు విద్యార్థుల ఎంపిక

**ప్రజాపక్షం/జవహర్ నగర్:** గిన్నీస్ వరల్డ్ రికార్డ్ తైక్వాండో పోటీలకు రణవీర్ అకాడమీ విద్యార్థులు ఎంపికవ్వడం అభినందనీయమని మాస్టర్ రమేష్ అన్నారు. హైదరాబాద్‌లోని జయంత్ రెడ్డి ఇంటర్‌నేషనల్ తైక్వాండో అకాడమీలో ఆధ్వర్యం లో ఆదివారం నిర్వహిస్తున్న పోటీల్లో కౌకూర్ రణవీర్ విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, మార్షల్‌ఆర్ట్స్ విద్యార్థులను ప్రపంచస్థాయికి తీసుకెళ్ళడమే లక్ష్యమని, క్రమశిక్షణతోనే ఉన్నత



శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. తైక్వాండా ఆత్మరక్షణకు, మానసిక ప్రశాంతతకు నిలయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రణవీర్, శ్రేయాస్‌లు తైక్వాండో పోటీల్లో పాల్గొంటారన్నారు. గిన్నీస్ రికార్డులో 6–60ఏళ్ళ వయసుగల వారు తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## భూ ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు : ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ఎవరైనా వ్యక్తులు గాని గుంపులుగా అక్రమంగా భూములను ఆక్రమించడం లేదా దురాక్రమణకు ప్రయత్నించడం, చట్ట విరుద్ధంగా అధికారం ప్రదర్శిస్తే వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతామని శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ హెచ్చరించారు. శామీర్‌పేట మండల పరిధిలోని బొమ్మరాశిపేటలో ఈ నెల 24 న ఓ భూ వివాదానికి సంబంధించి ఒక తీవ్రమైన సంఘటన చోటుచేసుకుందని ఇన్‌స్పెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారుగా 50 నుంచి 60 మంది వ్యక్తులు గుంపులుగా చేరి అక్రమంగా భూమిలోకి దూసుకెళ్లి అక్కడ విధుల్లో ఉన్న వాచ్‌మెన్, కార్మికులను బయటకు నెట్టేసి భయాందోళనలకు గురిచేశారని అన్నారు. ఆ భూమిలో ఉన్న కంటైనర్లను తొలగించి వాటి స్థానంలో తమకు సంబంధించిన కంటైనర్లను ఏర్పాటు చేసి అక్రమంగా భూమిని ఆక్రమించడానికి ప్రయత్నించారని చెప్పారు. ఈ ఘటనలో అక్కడ ఉన్న సిసి కెమరాలు ధ్వంసం చేయడంతో పాటు అక్కడ ఉన్న వారిపై ప్రాణహాని కలిగించేలా దాడులకు పాల్పడ్డారు. ఈ



ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు శామీర్‌పేట పోలీసులు కేసులు నమోదు చేశారు. ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఉపయోగించిన 4 కార్లను, 2 క్రేన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రమేయం ఉన్న 13 మందిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపరిచి వారిని చర్లపల్లి జైలుకు రిమాండ్‌కు తరలించారు. ఇంకా కొంతమంది తప్పించుకోవడంతో వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని చెప్పారు. భూమి వివాదంలో ఉందని తెలిసి అధిక డబ్బులు ఆశతో వచ్చిన వ్యక్తుల పాత్రపై పోలీసులు సమగ్రంగా విచారణ చేస్తున్నారు. భూ సంబంధిత వివాదాలను చట్టబద్ధత మార్గాల్లోనే పరిష్కరించుకోవాలని ఇన్‌స్పెక్టర్ శ్రీనాధ్ సూచించారు. సెటిల్‌మెంట్ పేరుతో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలు పాల్పడితే వారిపై పీడి యాక్ట్ అమలు చేస్తామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

## కోర్టు విధులను అడ్డుకున్న వ్యక్తిపై కేసు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** జిల్లా కోర్టు అధికారులపై అసభ్య పదజాలం ఉపయోగించిన నిందితున్ని అదుపులోకి తీసుకున్న సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ జిల్లా కోర్టులోని 1వ అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి కోర్టులో ఇన్‌చార్జ్ విధులు నిర్వహిస్తున్న సమయంలో నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ కేసులో నిందితుడు అయిన సురేష్‌ను కోర్టు సిబ్బంది పిలిచారు. నిందితున్ని ఎస్కార్ట్ పోలీస్(ఏఎస్ఐ) మహమ్మద్ ముక్తార్ అహ్మద్ కోర్టు జడ్జి ముందు హాజరు పర్చారు. వెంటనే నిందితుడు తనని అనవసరంగా అరెస్ట్ చేసారంటూ ఆరోపిస్తూ కోర్టు హాల్లో అసభ్య పదజాలం ఉపయోగిస్తూ విధులకు భంగం కల్గించినందుకు కోర్టులో ప్రాసెస్ సర్వర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రస్తుత బెంచ్ క్లర్క్ జె కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

## ఓటర్ల జాబితాల కచ్చితత్వంపై తహసీల్దార్ ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఓటర్ల జాబితాలో ఎలాంటి లోపాలు లేకుండా ఖచ్చితత్వం సాధించాలనే లక్ష్యంతో ఉప్పల్ తహసీల్దార్ ఫూల్ సింగ్ చౌహాన్ శనివారం పోలింగ్ స్టేషన్ 396 పరిధిలో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరిస్తూ, ముఖ్యంగా 40 సంవత్సరాల పైబడిన ఓటర్ల సమాచారాన్ని సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఓటరు జాబితాలో ఉన్న పేర్లు, వివరాలు సరిగా ఉన్నాయా అనే అంశాలను ప్రత్యక్షంగా తనిఖీ చేశారు. ఎలాంటి పొరపాట్లు ఉన్నా వెంటనే సరిచేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా తమ ఓటు హక్కు వినియోగంలో చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఎం.అలివేలు, స్వాతి, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# శాంతి స్థాపనతోనే సుఖసంతోషాలు

### అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ద్వితీయ సమావేశంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/మోమిన్‌పేట్ :** వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండల కేంద్రంలో భారత శాంతి సంఘీభావ సంఘం వికారాబాద్ జిల్లా ద్వితీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ ప్రపంచశాంతి కోసం ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు జరుగుతున్న ఈ సమావేశాలు మన జిల్లాలో కూడా జరగడం చాలా సంతోషం అన్నారు. ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన దేశం ఇండియా అని అన్నారు. మొదటి నుండి మనది పరమతసహనం కల దేశం.. ఇన్నివేల సంవత్సరాలలో భారతదేశంపై అనేక దండయాత్రలు జరిగాయని అన్నారు. మనదేశం నుండి ఎవ్వరు ఏ దేశంపైనా దండయాత్రలు, యుద్ధాలు చేయలేదు అని అన్నారు. హిందూధర్మం ప్రకారం శరణు వచ్చిన, సహాయం కోరి వచ్చిన శత్రువులను కూడా క్షమించాలని తెలిపారు. సామ్రాజ్యవాదం, రాజ్యవిస్తరణ, ఆధిపత్యం కోసం గతంలో యుద్ధాలు జరిగేవి అని తెలిపారు. నేడు మతం పేరుతో వ్యాపార అవకాశాల కోసం యుద్ధాలు జరుగుతున్నాయి. ఇది బాధపడే విషయం అని అన్నారు. దేవుని దృష్టిలో అందరూ సమానమే అని తెలిపారు.

మతాలు బోధించేది శాంతినే , కాని కొంత మంది తమ స్వార్థంకోసం దానిని వక్రీకరించి ప్రజలను రెచ్చకొడుతున్నారు. అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్, పాలస్తీనా, రష్యా, ఉక్రెయిన్ యుద్ధాలతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అష్టకష్టాలు పడుతున్నారు. ఇరాన్‌పై అమెరికా దాడిలో చమురు సరఫరా నిలిచిపోయి, మన భారతదేశంతో సహా ప్రపంచ వ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ అందక సామాన్య ప్రజలు కష్టాలు పడుతున్నారు. కొన్ని దేశాలు పేదలకోసం అవసరమైన అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలు చేయకుండా ఆయుధాలపై ఖర్చు చేస్తున్నాయని అన్నారు. ఈ ధోరణి మారాలి, శాంతి స్థాపన జరిగినప్పుడు అంతా బాగుంటుంది. ప్రజలు తమ కుటుంబాలతో సుఖంగా సంతోషంగా ఉంటారు.

ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## మహిళా లోకానికి ఇందిరా మహిళా శక్తి వెన్నుదన్ను

### వ్యాపారవేత్తలుగా పొదుపు సంఘాల మహిళలు




**ప్రజాపక్షం/కాప్రా:** మహిళా సాధికారతేధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా, ఆర్థికంగా తమ కాళ్లమీద తాము నిలబడాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి పథకం క్షేత్రస్థాయిలో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతోంది. ఇందులో భాగంగా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మహిళలు వ్యాపారవేత్తలుగా అవతారమెత్తుతున్నారు. కాప్రా సర్కిల్ పరిధిలోని ఏ.ఎస్.రావు నగర్ జపనీస్ థీమ్ పార్క్ వద్ద ఏర్పాటు చేసిన విజయ తెలంగాణ డెయిరీ పార్లర్ శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ నూతన విక్రయ కేంద్రాన్ని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, విజయ డెయిరీ జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, డిప్యూటి జిఎం అరుణ్ కుమార్‌లు కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలోని మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. గతంలో కేవలం చిన్నపాటి పొదుపు రుణాలకే పరిమితమైన మహిళలు, నేడు నేరుగా విజయ డెయిరీ వంటి ప్రభుత్వరంగ సంస్థలతో భాగస్వామ్యమై వ్యాపారాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సాయి సిద్ధి స్వశక్తి పొదుపు సంఘం సభ్యులు ఈ పార్లర్ నిర్వహణ బాధ్యతలను చేపట్టారు. వీరి వ్యాపార అభివృద్ధి కోసం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా రూ.2,00,000(రెండు లక్షల రూపాయలు) రుణాన్ని మంజూరు చేశారు. ఈ నిధులతో ఏర్పాటు చేసిన పార్లర్‌లో వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ సురేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్ శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ మాట్లాడుతూ, జపనీస్ థీమ్ పార్కుకు వచ్చే వందలాది మంది సందర్శకులకు ఈ కేంద్రం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, తద్వారా మహిళలకు గౌరవప్రదమైన ఆదాయం లభిస్తుందని వివరించారు. తెలంగాణ బ్రాండ్ అయిన విజయ డెయిరీ ఉత్పత్తులకు మార్కెట్‌లో ఉన్న నమ్మకాన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ తాజా పాలు, పెరుగు, వెన్న, నెయ్యి విక్రయిస్తున్నారు. అలాగే వేసవి తాపాన్ని తీర్చేందుకు మజ్జిగ, బాదం పాలు, ఫ్లేవర్డ్ మిల్క్‌తో పాటు రుచికరమైన పాలకోవా, మైసూరుపాక్ వంటి స్వీట్లు కూడా సిద్ధం చేశారు. జపనీస్ థీమ్ పార్క్ వంటి రద్దీ ప్రాంతంలో ఈ కేంద్రం ఉండటం వల్ల అటు పర్యాటకులకు స్వచ్ఛమైన పదార్థాలు లభించడంతో పాటు, ఇటు మహిళా సంఘాల అభివృద్ధికి బాటలు పడతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటైజర్ సూపర్వైజర్ సుదర్శన్ పలువురు అధికారులు, సంఘం ప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రూ.50కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం

* సుమారు 17 ఎకరాల 22 గుంటల భూమి చుట్టు ఫెన్సింగ్, ప్రభుత్వ బోర్డులు పాతిన రెవెన్యూ అధికారులు
* భూములను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషించిన తహసీల్దార్ సుచరితను అభినందిస్తున్న మండల ప్రజలు





**ప్రజాపక్షం/శామీర్‌పేట:** కోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూములను అప్పనంగా కబ్జాచేసి కమర్షియల్‌గా వాడుకుంటున్న భూములను శామీర్‌పేట తహశీల్దార్ సుచరిత గుర్తించి స్వాధీనపరుచుకున్నారు. ప్రభుత్వ భూముల చుట్టు కంచె(ఫెన్సింగ్) ఏర్పాటు చేసి ప్రభుత్వ బోర్డులను పాతించారు. వివరాల్లోకి వెళితే శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేట రెవెన్యూ పరిధిలోని భూములు సర్వే నెంబర్ 416/2 లో 10 ఎకరాల 12 గుంటలు, 417/2లో 3ఎకరాల 13 గుంటలు, 429/2 లో 3 ఎకరాల 36 గుంటలు మొత్తం 17 ఎకరాల 22 గుంటల్లో కొందరు కబ్జాకు పాల్పడి నీటి సంపులు ఏర్పాటు చేసి కమర్షియల్‌గా వాడుకుంటున్నట్లు రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో తహసీల్దార్ సుచరిత అక్కడకు వెళ్లి పరిశీలించారు. వెంటనే రెవెన్యూ అధికారులతో సర్వే చేయించి ప్రభుత్వ భూములను గుర్తించి ఫెన్సింగ్ వేసి హద్దులను ఏర్పాటు చేశారు. ఈ భూముల విలువ సుమారు రూ.50 కోట్ల వరకు పలుకుతుంది. ఇట్టి భూములను భవిష్యత్తులో ప్రజా ప్రయోజనాల కొరకు వాడుకునే విధంగా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనం చేసుకున్నందుకు తహశీల్దార్ సుచరితను అభినందిస్తు మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాఘవ, జి.పిఒ ఆంజనేయులు ఉన్నారు.

**కబ్జాకు పాల్పడితే ఉపేక్షించేది లేదు : శామీర్‌పేట తహసీల్దార్ సుచరిత**

శామీర్‌పేట మండల రెవెన్యూలో ప్రభుత్వ భూములను ఎవరైనా కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని తహశీల్దార్ సుచరిత హెచ్చరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుర్తించిన ప్రభుత్వ భూములకు హద్దులు ఏర్పాటు చేసి వెంటనే రక్షణ చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. శామీర్‌పేట మండలంలో ప్రభుత్వ భూములు కబ్జాలో ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని వాటిని గుర్తించి ఆ భూములను స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. అట్టి భూములను కబ్జాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## త్వరగా రైతుల నమోదు ప్రక్రియ పూర్తి

### కలెక్టర్ దీపక్‌తివారి




**ప్రజాపక్షం/వికారాబాద్:** 15రోజుల్లోగా రైతుల నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి ఆదేశించారు. 99 రోజుల పాటు చేపడుతున్న 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మే 4నుండి 8వ తేదీవరకు నిర్వహించే రైతు వారోత్సవాలలో చేపట్టాల్సిన వివిధ అంశాలపై వ్యవసాయ అనుబంధ శాఖల అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు రైతుగా నమోదు చేసుకునే వారిని గుర్తించి మే 10లోపు నమోదు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రైతు భరోసా, రైతుబంధు పథకాలు రైతులకు అందాలనే తప్పనిసరిగా



రైతు నమోదు చేపట్టాలనే విషయాన్ని రైతుల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. పట్టాదారు పుస్తకం ఆధారం కార్డులో అనుసంధానం చేసుకునే విధంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం, ఉద్యానవన పంటలు, ఆయిల్ ఫాం సాగుకు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. రైతులు నానో యురియాను వాడే విధంగా అవగాహన కల్పించాలని, విత్తన నాణ్యత, నకిలీ, అనధికారిక పత్తి విత్తనాల నియంత్రణకై జిల్లా డివిజన్, మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ బృందాల ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, వ్యవసాయ అధికారి రాజరత్నం, డిహెచ్ ఎస్ఓ సత్తార్, డిసిఒ నాగార్జున, సుదర్శన్, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

**ఉద్యోగులు, విద్యావంతులందరూ జనాభా స్వీయ గణనను చేసుకోవాలి**

జనాభా స్వీయ గణపై కలెక్టర్ మీడియ సామావేశం నిర్వహించారు. స్వీయ గణనను ఈనెల 26వ తేది నుండి 10 తేదీ వరకు పోర్టల్ అందుబాటులో ఉంటుందన్నారు. తప్పనిసరిగా అధికారులు, విద్యావంతులు స్వీయ నమోదు చేసుకుని తర్వాత తమ ఫోన్ నెంబర్‌కు వచ్చిన ఎస్ఇ ఐడి ని భద్రపరచుకోని ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్ తెలియజేయాలని, మీరు ఇచ్చిన సమాచారాన్ని ఎక్కడ కూడా బహిర్గతపరచడానికి వీలు ఉండదని, అత్యంత గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. వికారాబాద్ మున్సిపల్‌లోని గాంధీనగర్, గంగరం వార్డులలో నిర్వహిస్తున్న ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా పర్యాటించి పరిశీలించారు. అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటచారి, ఆర్‌డిఒ వాసు చంద్ర, తహసీల్దార్ లక్ష్మి నారాయణ ఎంపిడిఒ వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో బస్ స్టాప్ మార్పు నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపు

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ చౌరస్తా పరిధిలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో, వరంగల్, హనుమకొండ, యాదగిరిగుట్ట వైపు వెళ్లే బస్సుల స్టాప్‌ను తాత్కాలికంగా నల్ల చెరువు కట్ట సమీపానికి మార్చినట్లు ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా తెలిపారు. ప్రయాణికులు ఇకపై ఆ తాత్కాలిక స్టాప్ నుంచే బస్సులు ఎక్కాలని సూచించారు. నేటినుండి ఉప్పల్ రింగ్ రోడ్‌లో వరంగల్ వైపు వెళ్లే రహదారిని తాత్కాలికంగా మూసివేస్తున్నారు.దీనివల్ల ట్రాఫిక్ మళ్లింపులు ఉండే అవకాశం ఉన్నందున వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు. ప్రజలు పోలీసు, ట్రాఫిక్ అధికారుల సూచనలు పాటించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**ప్రజాపక్షం/మర్పల్లి:** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామానికి చెందిన నవాజ్ చల్మెడ్ గ్రామంలో టైల్స్ పని ముగించుకొని వస్తుండగా కంకోల్ దగ్గర ఒక్కసారిగా అడివి పంది అడ్డు రావడంతో దాని నుంచి తప్పించుకోపోయి పక్కనే ఉన్న చెట్టుకు గుద్దుకొని పడిపోయారు. చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించగా శుక్రవారం రాత్రి మరణించారు.





## పెట్టుబడిదారులకు వత్తాసుగా మోదీ పాలన

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** 'మే డే'.. ప్రపంచ కార్మికుల దినోత్సవ సందర్భంగా నిజాంపేట సర్కిల్‌లోని ఎఐటియుసి ఆధ్వర్యంలో శనివారం గోడపత్రాలను విడుదల చేసారు. ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్‌లు మాట్లాడుతూ అనేకమంది ప్రాణత్యాగాల వల్ల సాధించుకొన్న ఎనిమిది గంటల పనిదినాలు నేడు మోదీ నేతృత్వంలో దేశంలో పనికిరాకుండా పోయాయని, కార్మిక వ్యతిరేక విధానాలు అమలవుతూ పెట్టుబడిదారులకు వత్తాసుగా పాలన కొనసాగుతోందన్నారు. మరోసారి కార్మిక హక్కుల కోసం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నేతలు పొన్నకంటి దస్తగిరి, యాకన్న, సైదులు, యాదమ్మ, జ్యోతి,అనసూయ, తదితరులు పాల్గొన్నారు.



## తాగునీటి ఇక్కట్లు లేకుండా చర్యలు

### అలియాబాద్ చైర్ పర్సన్ శిరీషా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** అలియాబాద్ మున్సిపల్‌లో ప్రజలకు తాగునీటి ఇక్కట్లు లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమతం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. శనివారం అలియాబాద్ మున్సిపల్‌లోని 7వ, వార్డులో బోరు బావిని ఫ్లషింగ్ చేయించారు. అలాగే 8వ వార్డులో నూతన బోరు బావిని తవ్వించగా రెండు ఇంచుల నీరు వచ్చింది. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ వేసవిలో ప్రజలకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేస్తామని చెప్పారు. నీటి వసతి లేకుండా ఇబ్బందులు పడే ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. మున్సిపల్ సాధారణ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



## సుధాకర్‌నాయక్ కుటుంబాన్ని పరామర్శించిన ఎంపి ఈటల

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మూడుచింతలపల్లి మండలం లింగాపూర్‌తాండకు చెందిన బిజెపి రాష్ట్ర నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు కేతావత్ సుధాకర్ నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్ సుధాకర్‌నాయక్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. కుటుంబీకులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సుధాకర్‌నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. సుధాకర్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. సుధాకర్ మృతి పార్టీకి తీరనిలోటు అని అన్నారు. ఈ సందర్భంగా పార్టీకి అందించిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి బిజెపి అధ్యక్షుడు తప్పెట్ల నరేందర్‌గౌడ్, కౌన్సిలర్ ప్రియాంక శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపిపి చంద్రశేఖర్‌యాదవ్, మాజీ అధ్యక్షుడు కైర యాదగిరి, మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, గుగ్లావత్ వెంకటేష్, తదితరులు ఉన్నారు.

## నయీం అనుచరుడిపై హత్యాయత్నం... నిందితుడు అరెస్టు : కత్తులు స్వాధీనం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నయీం అనుచరుడిపై హత్యయత్నం చేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి జిల్లా భువనగిరికి చెందిన నయీం అనుచరుడు పాషం బిక్షపతి(53) గత మూడు సంవత్సరాలుగా సఫిల్‌గూడ సత్యానారాయణ కాలనీలో తన చిన్నమ్మ ఇంటిలో నివసిస్తూ ఉన్నాడు. ఇతని పై పూర్వం కొన్ని క్రిమినల్ కేసులు ఉన్నట్లు సమాచారం. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఫిర్యారుదారు తన న్యాయవాదులు కెవి సుధాకర్, ఎన్ శ్రీనివాసరావు,స్నేహితుడు రాహుల్, తమ్ముడు స్వామితో కలసి రాధిక చౌరస్తాలోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో భోజనం చేస్తుండగా ఇంతకుముందే పరిచయం ఉన్న ఎండి ఖాజా అక్కడికి వచ్చాడు. శ్రీనివాస్, ఖాజాలు 2014లో ఒక కేసులో జైలు శిక్ష అనుభవించారు. ఖాజా గతంలో శ్రీనివాస్‌కు పలుమార్లు డబ్బులు అడిగాడు కానీ అతను నిరాకరించాడు. ఖాజా శ్రీనివాస్ వైపు వస్తుండగా అనుమానం వచ్చి అతని చేతిలో ఉన్న బ్యాగును తనిఖీ చేయగా అందులో రెండు పెద్ద కత్తులు ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

## టిపిసిసి లీగల్ సెల్ కన్వీనర్‌గా ఉత్తమ్ ఠాకూర్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** టిపిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా మల్కాజిగిరి నియోజకవర్గానికి చెందిన ఉత్తమ్ ఠాకూర్ నియమితులయ్యారు. ఈ మేర కు లీగల్ సెల్ చైర్మన్ అశోక్ గౌడ్ శనివారం నియామక పత్రాన్ని అందచేసారు.

## సుందరీకరణ పనులు వేగిర పర్చండి

**ప్రజాపక్షం/ఉప్పల్ :** రామంతాపూర్ డివిజన్‌లోని ఇంద్రానగర్ చిన్నచెరువు సుందరీకరణ పనులకు వేగం తీసుకురావాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను మరోసారి కలిసి వినతి చేశారు. ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో చెరువులను అభివృద్ధి చేయాలని ఆయన పేర్కొన్నారు. చెరువుల వద్ద కట్ట విస్తరణ, గ్రీనరీ, లైటింగ్, బెంచీలు, పూల మొక్కలు ఏర్పాటు చేసి పచ్చదనాన్ని పెంచేలా సుందరీకరణ చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. సాయంకాలం మరియు సెలవు రోజులలో ప్రజలు విశ్రాంతి తీసుకునేలా అవసరమైన వసతులు కల్పించాలని కోరారు. ఈ విషయంపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ సానుకూలంగా స్పందించి, సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు గంధం నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

